తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 11 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 157 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

వెయ్యి గ్రామాలు దాటిన
భూ రీ-సర్వే

- 2,720 గ్రామాల్లో సమగ్ర సర్వేకు శ్రీకారం
- 416 గ్రామాల్లో పూర్తయిన సర్వే ప్రక్రియ
- భూ యజమానుల అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం
- పారపాట్లకు తావులేకుండా చూడాలన్న మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వేలో జరిగే చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి కారణం కాకూడదని సూచించారు.

మిగతా 2 లో..

రైతులకు రుణాల మంజూరులో
ప్రాధాన్యం ఇవ్వాలి



- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో ఉప ముఖ్యమంత్రి సమావేశం
- పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు సూచన
- రబీ సీజన్‌కు కొత్త రుణాలు సకాలంలో అందించాలి
- కౌలు రైతులు, మహిళా సంఘాలకు చేయూతనివ్వాలి : భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, కరవు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు బ్యాంకులు పూర్తి స్థాయిలో అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పించాలని బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. ప్రకృతి పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రుణాల విషయంలో వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారతీయ రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణాల చెల్లింపు గడువుల మార్పు ప్రక్రియను తక్షణమే చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. వర్షాభావం, కరవు ప్రభావంతో పంటల సాగు, దిగుబడులపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడిన రైతులకు రుణ చెల్లింపుల విషయంలో తగిన వెసులుబాటు కల్పించాలని కోరారు. బ్యాంకులు నిబంధనలకు అనుగుణంగా అర్హులైన రైతులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు.రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు కొత్త పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాగు పనులు ప్రారంభమైన తర్వాత రుణాల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు

మిగతా 2 లో..



ప్రజల నమ్మకమే పోలీసులకు
అసలైన గౌరవం

- నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచాలి
- ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- గ్రూప్-1 ద్వారా 119 మంది డీఎస్పీల నియామకం

హైదరాబాద్, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

పోలీసు శాఖలో కొత్తగా బాధ్యతలు చేపట్టబోతున్న ప్రొబేషనరీ డీఎస్పీలు నిబద్ధత, నిజాయతీతో విధులు నిర్వర్తించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పది మంది డీఎస్పీలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అవినీతి పెరిగిపోయిందనే ఆరోపణలు వచ్చే అవకాశం ఉంటుందని, అదే పది మంది అధికారులు నిబద్ధతతో పనిచేస్తే రాష్ట్ర ప్రతిష్ఠను ఇతర రాష్ట్రాల్లోనూ పెంచవచ్చని పేర్కొన్నారు. మీ నుంచి తాను ఆశిస్తున్నది

మిగతా 2 లో..

ఉస్మానియా ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించాలి

- నాన్ టీచింగ్ సిబ్బంది మహాధర్నాకు మద్దతు కల్వకుంట్ల కవిత
- విశ్వవిద్యాలయానికి ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు ఏమయ్యాయని ప్రశ్న
- ఉద్యోగుల డిమాండ్లపై గవర్నర్ స్పందించాలని విజ్ఞప్తి
- కాంట్రాక్టు, కాలపరిమితి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్




హైదరాబాద్, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

ఉస్మానియా విశ్వవిద్యాలయ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ నాన్ టీచింగ్ సిబ్బంది సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొని ఉద్యోగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని

మిగతా 2 లో..

సిద్దిపేట అభివృద్ధికి రూ.4 కోట్ల నిధులు

- ఆరు వార్డుల్లో మౌలిక వసతుల పనులకు శ్రీకారం
- సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం..
- వీధి దీపాల ఏర్పాటుకు నిధుల కేటాయింపు: మంత్రి వివేక్ వెంకటస్వామి




సిద్దిపేట, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రూ.4 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని 12, 13, 15, 22, 33, 35వ వార్డుల్లో వివిధ పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. ఆయా

మిగతా 2 లో..

బాసర ఆర్జీయూకేటీలో
కలుషిత నీటి కలకలం

- గంగా, యమునా వసతి గృహాల్లో నీటి సమస్య
- మురుగునీటిని పోలిన నీరు వస్తోందని విద్యార్థుల ఆరోపణ
- నీటి నాణ్యతపై విద్యార్థుల ఆందోళన
- నమూనాలను ప్రయోగశాలకు పంపిన విశ్వవిద్యాలయ అధికారులు



బాసర, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయంలో కలుషిత తాగునీటి సమస్య కలకలం రేపుతోంది. విశ్వవిద్యాలయంలోని గంగా, యమునా వసతి గృహాల్లో మురుగునీటిని పోలిన నీరు సరఫరా అవుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తాగునీటిగా అందిస్తున్న నీటిలో దుర్వాసన, అపరిశుభ్రత కనిపిస్తున్నాయని,

మిగతా 2 లో..

ఆస్తి పన్ను విధానంపై
'క్యూర్ చట్టం–2026' సమీక్ష

- రెవెన్యూ సిబ్బందికి అవగాహన సమావేశం
- మూలధన విలువ ఆధారిత పన్ను విధానంపై వివరణ
- పన్ను లెక్కింపు, పునఃమదింపు ప్రక్రియలపై చర్చ

సైబరాబాద్, నవంబర్ 10
(తెలంగాణ ముచ్చట్లు):

క్యూర్ చట్టం-2026 అమలుపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ (రెవెన్యూ), జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అన్ని సర్కిళ్లకు చెందిన రెవెన్యూ సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్త చట్టంలోని నిబంధనలు, వాటి అమలు విధానం, ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించిన అంశాలపై అధికారులకు అవగాహన కల్పించడమే

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఉస్మానియా ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ నిధులు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఏడాదిన్నరగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యమాలకు పుట్టినిల్లుగా నిలిచిందని, అటువంటి విద్యాసంస్థలో 35 ఏళ్లుగా ఉద్యోగుల శ్రమకు తగిన గుర్తింపు, ప్రయోజనాలు అందడం లేదని కవిత ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వాల హయాంలోనూ నాన్ టీచింగ్ ఉద్యోగుల పరిస్థితిలో మార్పు రాలేదని విమర్శించారు. విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తితో పనిచేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలోని వర్సిటీల్లో ప్రొఫెసర్లు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. శాశ్వత ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు కలిసి పోరాటం చేయడం అభినందనీయమని పేర్కొంటూ, నాన్ పర్మినెంట్ సిబ్బంది కోసం ముందుకొచ్చిన శాశ్వత ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు, కాలపరిమితి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వారికి రావాల్సిన వార్షిక ప్రయోజనాలను క్రమం తప్పకుండా చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని శాశ్వత ఉద్యోగులతో సమానంగా వర్తింపజేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. 2001 నుంచి 2004 మధ్య నియమితులైన వారికి పాత పెన్షన్ విధానం, ఆ తర్వాత నియమితులైన వారికి వాటాదారుల పెన్షన్ విధానం అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన నిధులు, భవిష్య నిధి చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. స్థానికులకు 85 శాతం ఉద్యోగాలు కల్పించాలనే నిబంధనను ప్రస్తావిస్తూ, భద్రతా సిబ్బంది నియామకాల్లో స్థానికులకు తగిన ప్రాధాన్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రొఫెసర్ మనోహర్‌ను సహేతుకమైన కారణాలు లేకుండా సస్పెండ్ చేశారని కవిత ఆరోపించారు. ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయానికి నిధులు విడుదల చేయకుండా ఉపకులపతిని ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఉపకులపతి ప్రభుత్వంతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడితే చరిత్ర క్షమించదని విమర్శించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్ ఈ వ్యవహారంపై వెంటనే స్పందించాలని, ఏడాదిన్నరగా కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పట్టుదలతో పోరాటం కొనసాగించాలని కవిత పిలుపునిచ్చారు. ఆరు సంఘాలతో ఏర్పడిన సంయుక్త కార్యాచరణ సమితి ఐక్యంగా ముందుకు సాగితే విజయం సాధించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో పాల్గొంటున్నారని, వారి పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో తమ పార్టీ తరఫున శాసనమండలి అభ్యర్థులుగా ఉన్న శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్‌కు ఉద్యోగులు, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని కోరారు. వారిలో ఒకరు కాకతీయ, మరొకరు ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులని పేర్కొంటూ, ఎన్నికల్లో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వెయ్యి గ్రామాలు దాటిన
భూ రీ-సర్వే

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో సర్వే ప్రక్రియ కీలక మైలురాయిని దాటిందని, 416 గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వేగంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.సచివాలయంలో మంగళవారం రెవెన్యూ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు.ప్రతి గ్రామంలో సర్వే ప్రారంభించే ముందు సంబంధిత రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని,అందులోని భూముల విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, సరిహద్దుల వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే క్షేత్రస్థాయి ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన అనంతరం భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.

సర్వే విధానం,నోటీసుల జారీ,అభ్యంతరాల నమోదు, వాటి పరిష్కారంపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకుండా ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలని చెప్పారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపు కల్పించే భూధార్ సంఖ్యల కేటాయింపును వేగవంతం చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో చిన్న లోపాలు గుర్తించినా వెంటనే సరిదిద్దాలని,భవిష్యత్తులో కొత్త భూ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాలకు సంబంధించి తరతరాలుగా కొనసాగుతున్న సమస్యలకు ఈ రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి సూచించారు. భూ యజమానుల సంతృప్తే సర్వే విజయానికి ప్రామాణికంగా ఉండాలని, రైతులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.సర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ సహాయ సంచాలకులతో ప్రత్యేక దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లాలవారీగా పురోగతిని సమీక్షించి తదుపరి కార్యాచరణపై ఆదేశాలు ఇవ్వనున్నారు.సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సంయుక్త సంచాలకురాలు ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే పోలీసులకు అసలైన గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

ఈఇదేనని స్పష్టం చేశారు.

విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించాలన్న సంకల్పంతో గ్రూప్1 నియామకాలను పూర్తి చేశామని తెలిపారు. ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ డీఎస్పీల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ సమయంలో వారు దిగిన చిత్రాల ప్రదర్శనను తిలకించి, నేరస్థల పరిశోధనకు సంబంధించిన మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కొత్తగా డీఎస్పీలుగా బాధ్యతలు చేపట్టినా తమ నేపథ్యాన్ని, ఈ స్థాయికి చేరుకోవడానికి చేసిన కృషిని మరిచిపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. తమ హోదాకు న్యాయం చేయాలంటే లక్ష్యాన్ని గుర్తుంచుకుని పనిచేయాలన్నారు. పోలీసు వ్యవస్థలో క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసేది డీఎస్పీలేనని, వారి పనితీరే ప్రభుత్వానికి గీటురాయిగా మారుతుందని చెప్పారు.సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల మాటలను ఓపికగా వినాలని, వారి ఇబ్బందులను పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్య ఏమిటో సరిగ్గా అర్థం చేసుకుంటే పరిష్కారంలో సగం విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను పోలీసులకు చెప్పుకోవడానికి కారణం ఆ శాఖపై ఉన్న నమ్మకమేనని, దశాబ్దాలుగా శాంతి భద్రతలను కాపాడుతూ వచ్చిన సీనియర్ అధికారులు సంపాదించిన గౌరవాన్ని కొత్త అధికారులు నిలబెట్టాలని అన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని రేవంత్‌రెడ్డి వివరించారు. గతంలో అక్రమ మద్యం తయారీ, రవాణా వంటి నేరాలు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం పోలీసులకు సవాలుగా మారిందన్నారు. మాదకద్రవ్యాల వ్యవహారంలో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని, వాటి నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రవాణా, ఆహార భద్రత, మాదకద్రవ్యాలు, అంతర్జాల మోసాలు వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు స్పష్టమైన కార్యాచరణ అవసరమని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దూర ప్రాంతాల్లో ఉన్నవ్యక్తులు కూడా ప్రజల సొమ్మును కాజేస్తున్నారని, అలాంటి నేరాలను అరికట్టేందుకు పోలీసు సిబ్బంది నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నేరాల స్వభావానికి అనుగుణంగా నేర పరిశోధన విభాగం, అవినీతి నిరోధక శాఖ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా పనిచేసే అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు.

పోలీసు శాఖలో బయటి సంస్థలపై ఆధారపడటం కంటే సొంత నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరమైతే మంచి సంస్థల్లో శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని అర్థం చేసుకుని వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైతే ఒకటి, రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణకు పంపిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులకే కాకుండా ఇతర రంగాల ఉద్యోగులకూ శిక్షణ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో గ్రూప్1 నియామకాలను పూర్తి చేశామని, 2011 తర్వాత 2025లో మళ్లీ ఈ నియామకాలు చేపట్టినట్లు చెప్పారు.ప్రశ్నపత్రాల లీకేజీతో గతంలో ఏర్పడిన గందరగోళం యువతలో ఆందోళన కలిగించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నిపుణులను నియమించామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 562 గ్రూప్1 ఖాళీల భర్తీ చేపట్టామని, అందులో 119 మంది డీఎస్పీలుగా ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు సంచాలకుడు సీవీ ఆనంద్, ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షురాలు,సంచాలకురాలు శాంతికుమారి, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్‌రెడ్డి, తెలంగాణ పోలీసు అకాడమీ సంచాలకురాలు అభిలాష బిష్ట్ తదితరులు పాల్గొన్నారు.శిక్షణలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు శిక్షణార్థి డీఎస్పీలకు ముఖ్యమంత్రి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీసు ఉద్యోగం కేవలం హోదా, అధికారం కోసం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యతతో కూడుకున్నదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేయడం, శాంతిభద్రతలను కాపాడటం, నేరాల నియంత్రణలో నిబద్ధతతో పనిచేయడం ద్వారా పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రొబేషనరీ డీఎస్పీలకు దిశానిర్దేశం చేశారు.

రైతులకు రుణాల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు.వ్యవసాయ రంగంతో పాటు ఇతర వర్గాలకు కూడా రుణ సదుపాయాలు విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు. అర్హులైన విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యా రుణాలు అందించాలని, సామాన్య ప్రజలకు గృహ రుణాల మంజూరులో సహకరించాలని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి అవసరమైన రుణ సదుపాయాలను విస్తరించాలని తెలిపారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా బ్యాంకులు రుణ సహకారం అందించాలని, మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కూడా తోడ్పడాలని కోరారు.రాష్ట్రంలో వ్యవసాయ రంగం, విద్య, గృహ నిర్మాణం, చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు బ్యాంకుల సహకారం కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగ యువత అవసరాలను దృష్టిలో ఉంచుకుని రుణాల మంజూరులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకు ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఉన్నతాధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్దిపేట అభివృద్ధికి రూ.4 కోట్ల నిధులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో ప్రజలకు ఎదురవుతున్న మౌలిక వసతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.

నిధులతో ఆరు వార్డుల్లో సిమెంటు రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారుల పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ పనుల ప్రధాన ఉద్దేశం. కాలనీల్లో రహదారుల అభివృద్ధి వల్ల వాహనదారులు, పాదచారులకు ప్రయోజనం కలగనుంది. పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు సంబంధిత విభాగాలు చర్యలు తీసుకోనున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి కూడా ఈ నిధుల్లో ప్రాధాన్యత కల్పించారు. ఆయా వార్డుల్లో అవసరమైన ప్రాంతాల్లో కాలువల నిర్మాణం, ఇతర పారుదల సదుపాయాలను మెరుగుపరచనున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఇబ్బందులు తగ్గనున్నాయి.

వీధి దీపాల ఏర్పాటు, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు వినియోగించనున్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని భూమిపూజ చేశారు. అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులు, మురుగునీటి పారుదల, వీధి దీపాలు వంటి వసతులు మెరుగుపడితే ప్రజల దైనందిన జీవనానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. రూ.4 కోట్లతో చేపట్టనున్న పనులు పూర్తయితే ఆయా వార్డుల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.

బాసర ఆర్జీయూకేటీలో
కలుషిత నీటి కలకలం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో నీటిని వినియోగించేందుకు భయపడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో ఈ సమస్యపై వసతి గృహాల్లో ఆందోళన నెలకొంది. రోజువారీ అవసరాలకు, ముఖ్యంగా తాగడానికి ఉపయోగించే నీటి నాణ్యతపై విద్యార్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ యంత్రాంగంపై ఉందని పేర్కొంటున్నారు. కలుషిత నీటి సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

గంగా, యమునా వసతి గృహాల్లో నీటి పరిస్థితిపై విద్యార్థులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో విశ్వవిద్యాలయ అధికారులు స్పందించారు. నీటి నాణ్యతను నిర్ధారించేందుకు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు వెల్లడించారు. నీటిలో కలుషిత పదార్థాలు ఉన్నాయా? అది వినియోగానికి సురక్షితమేనా? అనే అంశాలను పరీక్షల ద్వారా నిర్ధారించనున్నట్లు తెలిపారు.

ప్రయోగశాల నుంచి పరీక్షల ఫలితాలు అందిన తర్వాత వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. నీటి నమూనాల పరిశీలనలో వెల్లడయ్యే అంశాలను బట్టి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయితే పరీక్షల ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉండటంతో నీరు నిజంగా కలుషితమైందా? అనే విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యమైన అంశం. ప్రయోగశాల పరీక్షలను త్వరగా పూర్తి చేసి ఫలితాలను వెల్లడించాలని విద్యార్థులు కోరుతున్నారు. అప్పటివరకు తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆశిస్తున్నారు.ప్రయోగశాల నివేదిక అనంతరం విశ్వవిద్యాలయ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

ఆస్తి పన్ను విధానంపై 'క్యూర్ చట్టం–2026' సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



సమావేశ ప్రధాన ఉద్దేశంగా సాగింది.క్యూర్ చట్టం-2026లో పొందుపరిచిన ఆస్తి పన్ను నిబంధనలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఇప్పటివరకు అనుసరిస్తున్న పద్ధతులతో పాటు మూలధన విలువ ఆధారంగా ఆస్తి పన్ను నిర్ధారించే విధానాన్ని వివరించారు. ఆస్తి విలువను ప్రాతిపదికగా తీసుకుని పన్ను ఎలా లెక్కించాలి, సంబంధిత వివరాలను ఎలా పరిశీలించాలి, నిబంధనల ప్రకారం పన్ను నిర్ధారణ ఎలా చేపట్టాలనే అంశాలను అధికారులకు వివరించారు. ఆస్తుల పునఃమదింపు ప్రక్రియపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. అవసరమైన సందర్భాల్లో ఆస్తుల వివరాలను తిరిగి పరిశీలించడం, పన్ను మొత్తాన్ని నిబంధనల ప్రకారం సవరించడం, సంబంధిత రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.పన్ను లెక్కింపులో పారదర్శకత, ఏకరీతి విధానం పాటించేలా అన్ని సర్కిళ్లలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఇతర అంశాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్ల ప్రక్రియ, ఆదాయ సేకరణకు సంబంధించిన విధానాలు, కొత్త నిబంధనల అమలులో ఎదురయ్యే అంశాలపై అధికారులతో చర్చించారు.ప్రతి సర్కిల్‌లో చట్టంలోని నిబంధనలను సక్రమంగా అమలు చేయాలని, రెవెన్యూ వ్యవహారాల్లో సమర్థత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూర్ చట్టం-2026 అమలులో అన్ని స్థాయిల అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలని సమావేశంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఆస్తి పన్ను నిర్ధారణ నుంచి వసూళ్ల వరకు ప్రతి దశలో నిబంధనలను అనుసరించాలని, సర్కిళ్లవారీగా అమలు తీరును నిరంతరం పరిశీలించాలని కమిషనర్ సూచించారు. కొత్త విధానంపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించడం ద్వారా పన్ను నిర్వహణను మరింత క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 11 - నవంబర్ 2026
వరంగల్ 03

ట్రాక్టర్ కొనివ్వలేదని యువకుడి బలవన్మరణం

- **బేతుపల్లి చెరువులో మృతదేహం లభ్యం.**



సత్తుపల్లి, నవంబరు 10 (తెలంగాణ ముచ్చట్లు): ట్రాక్టర్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామనగరం గ్రామ శివారులోని బేతుపల్లి చెరువు కలంగి ప్రాంతంలో కడెం మనోజ్ (20) మృతదేహం సోమవారం వెలుగుచూసింది. దమ్మపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కడెం సురేష్ కుమారుడు మనోజ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ట్రాక్టర్ కొనివ్వాలని తండ్రిని కోరుతున్నాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ప్రస్తుతం కొనివ్వలేనని, వచ్చే ఏడాది కొనిస్తానని తండ్రి చెప్పాడు. ఈ క్రమంలో ఈ నెల ఆరవ తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనోజ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో వుకే శివ అనే వ్యక్తి ఫోన్ చేసి బేతుపల్లి చెరువులో మనోజ్ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ట్రాక్టర్ కొనివ్వలేదనే మనస్తాపంతోనే మనోజ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమారుడి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు తెలిపారు. కడెం సురేష్ ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌ఓ తుమ్మలపల్లి శ్రీహరి వెల్లడించారు.

తప్పుడు పత్రాలు సృష్టించి ఎస్సీ వ్యక్తి భూమిని కబ్జా చేశారని ఆరోపణలు..

- **న్యాయం చేయాలని బాధితుడి విజ్ఞప్తి**




ఖమ్మం బ్యూరో,నవంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సొరకాయల చిన్న కృష్ణకు వారసత్వంగా సంక్రమించిన 10 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కోటేశ్వరరావు ఆక్రమించి, తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చిన్న కృష్ణ ఆరోపించారు.
వివరాల్లోకి వెళితే.. సొరకాయల చిన్న కృష్ణ తండ్రి పెద్ద కోటయ్య 1951లో అదే గ్రామానికి చెందిన శ్రీనాధుని శేషగిరిరావు వద్ద 10 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. అనంతరం 1998లో తన తండ్రి మరణించడంతో అదే భూమిలో అంత్యక్రియలు నిర్వహించి సమాధి ఏర్పాటు చేశారని, 2007లో తన తల్లిని కూడా అదే భూమిలో సమాధి చేసినట్లు తెలిపారు. కాగా, 2024లో సదరు భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించగా, 2014లో బొడ్డుపల్లి కోటేశ్వరరావు 1960లో భూమి కొనుగోలు చేసినట్లు చూపించే పత్రాలను సృష్టించి, వాటి ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినట్లు తెలిసిందని చిన్న కృష్ణ ఆరోపించారు. అంతేకాకుండా, ఆ పత్రాల్లో పేర్కొన్న 1960 నాటికి కోటేశ్వరరావు వయస్సు కేవలం తొమ్మిదేళ్లు మాత్రమేనని, ఇది పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై బాధితుడు చిన్న కృష్ణ గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించి సివిల్ కేసు దాఖలు చేయడంతో పాటు, సంబంధిత పోలీస్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన తండ్రి కొనుగోలు చేసిన వారసత్వ భూమిని అక్రమ పత్రాల ఆధారంగా స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు వెలికితీసి తనకు న్యాయం చేయాలని సొరకాయల చిన్న కృష్ణ అధికారులను కోరుతున్నారు.

నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- **జిల్లా కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ వినతి**

వనపర్తి,నవంబరు10(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిజమైన నిరుపేదలకు, ఇల్లు లేని కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వనపర్తి జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ మాట్లాడుతూ,గ్రామాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో జీవనం సాగిస్తున్న నిరుపేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.ఇళ్ల మంజూరులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, ఇతర ప్రభావాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు సమన్వయంతో నిజమైన అర్హులను గుర్తించి న్యాయం చేయాలని పేర్కొన్నారు.అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని పేద కుటుంబాల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందినప్పుడే ప్రభుత్వ పథకం లక్ష్యం నెరవేరుతుందని కొమ్ము చెన్నకేశవులు మాదిగ పేర్కొన్నారు.



శివనామస్మరణతో మార్మోగిన ఆలయం.. ఆకాశదీప కార్యక్రమానికి శ్రీకారం!

ఎల్కతుర్తి, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో కార్తీకమాస ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆకాశదీప కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయం శివనామస్మరణతో మార్మోగింది.
కార్తీకమాసం సందర్భంగా నెలరోజుల పాటు ప్రతిరోజూ సాయంకాలం ఆలయంలో ఆకాశదీప కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ.. కార్తీకమాసంలో నిర్వహించే ఆకాశదీప కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.
కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ గంజి భవ నరుషి, రాకేష్, అశోక్, విజయశ్రీ, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వీఓఏగా శ్రీధర్‌ను తిరిగి నియమించాలి

- **జిల్లా కలెక్టర్‌కు మహిళల వినతి**



మహబూబ్‌నగర్,నవంబర్10(తెలంగాణ ముచ్చట్లు): మహబూబ్‌నగర్ అడ్డాకల్ మండలం బలీదుపల్లి గ్రామ సంఘం విఓఏగా దాదాపు 20 సంవత్సరాలుగా బాధ్యతాయుతంగా సేవలందిస్తున్న శ్రీధర్ పేరును తిరిగి నమోదు చేయాలని కోరుతూ గ్రామ మహిళలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గ్రామ మహిళల కథనం ప్రకారం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, గ్రామ సంఘం తీర్మానం లేకుండానే శ్రీధర్ పేరును అధికారులు తొలగించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ మహిళలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని, శ్రీధర్‌ను తిరిగి విఓఏగా కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ మేరకు పెద్ద సంఖ్యలో మహిళలు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గ్రామ సంఘం మహిళల అంగీకారం లేకుండా విఓఏ పేరును తొలగించడం సరికాదని, వెంటనే శ్రీధర్ పేరును తిరిగి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మండల ప్రాజెక్టు అధికారి మహేష్‌ను మహిళలు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఆయన, తాను శ్రీధర్ పేరును తొలగించలేదని, గ్రామంలో విచారణ జరిపించాలని పై అధికారులకు నివేదిక అందించినట్లు వివరించారు.శ్రీధర్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు. తమ సమస్య పరిష్కార మయ్యే వరకు గ్రామంలో రుణాల చెల్లింపులు నిలిపివేస్తామని అధికారులకు స్పష్టం చేశారు.దాదాపు రెండు దశాబ్దాలుగా తమ గ్రామ సంఘానికి సేవలందిస్తున్న శ్రీధర్‌ను తిరిగి విఓఏగా కొనసాగించాలని, తమకు న్యాయం చేయాలని గ్రామ మహిళలు జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

భూ రికార్డుల్లో మాయాజాలమా?.. కొనుగోలుదారుడి భూమిపై ఇతరుల పట్టా!

- **2009లో కొనుగోలు చేసిన ఎకరం 15 గుంటల భూమికి 2010లో ఇతరుల పేర్లపై పట్టా..**
- **న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు**



ఎల్కతుర్తి, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): భూమి కొనుగోలు చేసింది ఒకరు.. పట్టా చేసుకున్నది మరొకరు.. అన్నట్లుగా ఎల్కతుర్తి మండలంలో భూ వివాదం వెలుగులోకి వచ్చింది. డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన భూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారని బాధితుడు పోతరబోయిన కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.
మంగళవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ.. మండలంలోని భావుపేట శివారులో ఉన్న సర్వే నంబర్ 115లోని భూమికి సంబంధించి తమకు అన్యాయం జరిగిందని తెలిపారు.
దండేపల్లి గ్రామానికి చెందిన భూ యజమాని పొలాటి సీతారామారావు, ఆయన వంశస్థుల నుంచి భావుపేట గ్రామానికి చెందిన పోతరబోయిన కొమురయ్య, పోతరబోయిన కుమారస్వామి, పోతరబోయిన ఐలుమల్లు, వేల్పుల బండ కొమురయ్య, ఎలబోయిన కొమురయ్య, పోతరబోయిన ఐలమల్లు అనే ఆరుగురు వ్యక్తులు మొత్తం ఆరు ఎకరాల 17 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు వివరించారు.
అనంతరం 2009 సంవత్సరంలో వారి వద్ద నుంచి తన భార్య పోతరబోయిన గట్టమ్మ పేరుపై ఎకరం 15 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన పోతరబోయిన శ్రీధర్, పోతరబోయిన కనకలక్ష్మి, పోతరబోయిన రజనీకాంత్‌లు 2010 సంవత్సరంలో సదరు భూమిని తమ పేర్లపై అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు.
తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమి ఇతరుల పేర్లపై ఎలా పట్టా అయిందో అర్థం కావడం లేదని కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు భూమి కొనుగోలు పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. తమ భూమికి సంబంధించిన వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వ అధికారులను బాధితుడు విజ్ఞప్తి చేశారు.

మహిళల రక్షణ, సైబర్ నేరాలపై విద్యార్థినీలకు అవగాహన



పెద్దమందడి,నవంబర్10(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా షీ టీం ఆధ్వర్యంలో పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ప్రతినిధులు శ్రీశైలం చారి, యాదగిరి రెడ్డి పాల్గొని విద్యార్థినీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, షేర్‌చాట్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసపూరిత పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడా, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ ఆటల వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు.అలాగే బ్యాంకు లావాదేవీలు, ఏటీఎం వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేతాలు వెల్లడించకూడదని విద్యార్థినీలకు సూచించారు.మహిళలు, బాలికలకు ఎలాంటి ఆపద ఎదురైనా, అత్యవసర సహాయం అవసరమైనా 112, 100 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు. విద్యార్థినీలు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉంటూ, సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని షీ టీం ప్రతినిధులు సూచించారు.

నగర అభివృద్ధికి బండి సంజయ్ ప్రత్యేక కార్యాచరణ

- **నగరంలోని ప్రతి గల్లీలో ఏడాదిలోపు అంతర్గత రహదారుల నిర్మాణం.**
- **నగర సమగ్ర అభివృద్ధికి ప్రజలు సహకరించాలి..కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈ ప్రయత్నానికి ప్రజలు సహకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి గల్లీలో ఏడాదిలోపు అంతర్గత రహదారులను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం 50వ డివిజన్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లతో కలిసి జ్యోతినగర్ ప్రాంతంలో రూ.79 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఆర్‌సీసీ డ్రైన్, స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

టీడీపీ గౌస్‌ను పరామర్శించిన సాహితీ కళా వేదిక సభ్యులు



వనపర్తి,నవంబర్10(తెలంగాణ ముచ్చట్లు): క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న టీడీపీ గౌస్‌ను సాహితీ కళా వేదిక సభ్యులు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న గౌస్ రెండు రోజుల క్రితం వనపర్తికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కళా వేదిక ప్రతినిధులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. గౌస్‌కు ధైర్యం చెప్పారు.అనంతరం గౌస్ తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ, నాలుగు దశాబ్దాలుగా రాజకీయ రంగంలో కొనసాగుతున్న తనకు మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించి శస్త్రచికిత్స చేయించారని కాగితంపై రాసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు, గద్దె భాస్కర్, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ జన్మదిన వేడుకలు



ఉప్పల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూల్ సింగ్ చౌహాన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిప్యూటీ తహసీల్దార్ బి. శ్రీపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎం. అశ్విని గౌడ్, ఎం. రాఘవ, సీనియర్ అసిస్టెంట్ నైదా, జూనియర్ అసిస్టెంట్లు ఎం. అనంత రాములు, ఎం. అలివేలి, పి. వెంకన్న, వనిత, అంజిరెడ్డి, స్వాతి, కంప్యూటర్ ఆపరేటర్ సునీత, భూభారతి ఆపరేటర్ ప్రవీణ్, సర్వే అసిస్టెంట్ గిరి, రెవెన్యూ సిబ్బంది సత్యనారాయణ, స్వామి, సంజీవ, రణధీర్, రాజు, సూర్యప్రకాష్, గణేష్ తదితరులు పాల్గొని ఎమ్మార్వోకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

- **ఐఏఎస్ అధికారి యోగితా రాణికి ఎమ్మెల్యే వినతి**
- **విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని వెల్లడి**
- **ఖాళీలను గుర్తించి వెంటనే నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి**
- **విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచన**



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐఏఎస్ అధికారి డాక్టర్ యోగితా రాణిని కలిసి వినతిపత్రం అందజేశారు.నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలను ఆమెకు వివరించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన స్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎమ్మెల్యే వివరించారు. కొన్ని పాఠశాలల్లో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడం లేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని, ఇది వారి విద్యాభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. విద్యా సంవత్సరం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్యను మరింత ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఉపాధ్యాయులు లేని పాఠశాలలను తక్షణమే గుర్తించి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు బోధనకు ఆటంకం కలగకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే సరిపడా ఉపాధ్యాయులు ఉండటంతో పాటు అవసరమైన విద్యా వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది కొరత వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఏ విద్యార్థి విద్యలో వెనుకబడకూడదని బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. పాఠశాలల్లో ఖాళీలను గుర్తించి నియామకాలకు సంబంధించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఐఏఎస్ అధికారి యోగితా రాణిని కోరారు.

దక్షిణ కొరియా అంతర్జాతీయ వేదికపై ముల్కనూర్ సహకార సంఘం



- **ప్రపంచ మార్కెట్లలో తెలంగాణ రైతుల ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం: అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి**

భీమదేవరపల్లి, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సంఘం అంతర్జాతీయ స్థాయిలో మరో ముందడుగు వేసింది.భారతదేశం-దక్షిణ కొరియా మధ్య ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను అన్వేషించే లక్ష్యంతో ASSOCHAM ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 6 వరకు దక్షిణ కొరియాలో నిర్వహించిన ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం పర్యటనలో ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ పర్యటనలో భారతదేశానికి చెందిన వివిధ ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, ఆహార శుద్ధి సాంకేతికత, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలపై చర్చించారు.

ఆధునిక ఆహార శుద్ధి సాంకేతికతపై అధ్యయనం

పర్యటనలో భాగంగా దక్షిణ కొరియాలోని ప్రముఖ జాతీయ ఆహార పరిశ్రమల సముదాయం FOODPOLIS (National Food Cluster of South Korea)ను సందర్శించి అక్కడి ఆధునిక ఆహార శుద్ధి విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, పరిశోధన, అభివృద్ధి, అంతర్జాతీయ మార్కెటింగ్ విధానాలను పరిశీలించారు. అలాగే South Korean National Fisheries Science Museumను సందర్శించి ఆహార రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు.

సియోల్‌లోని COEX Convention and Exhibition Centerలో నిర్వహించిన COEX FOOD WEEK 2026ను సందర్శించి అంతర్జాతీయ ఆహార ఉత్పత్తులు, ఆధునిక ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ సాంకేతికతలు, నూతన వాణిజ్య అవకాశాలను పరిశీలించారు.

భారత రాయబార కార్యాలయ అధికారులతో సమావేశం

ఈ సందర్భంగా కొరియాలోని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ రమేష్ అయ్యర్, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయానికి చెందిన IFS అధికారిణి దేవి కుమం తదితరులను అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలిశారు.భారతీయ వ్యవసాయ, ఆహార ఉత్పత్తులకు దక్షిణ కొరియాలో ఉన్న మార్కెట్ అవకాశాలు, సహకార సంఘాల ద్వారా అంతర్జాతీయ వ్యాపారాన్ని ప్రోత్సహించడం, నూతన మార్కెట్ల అన్వేషణ వంటి అంశాలపై చర్చించారు.

అంతర్జాతీయ మార్కెట్లలో ముల్కనూర్ బ్రాండ్లకు గుర్తింపు లక్ష్యం

ముల్కనూర్ సహకార సంఘం ఇప్పటికే రైతుల నుంచి నేరుగా ధాన్యం, విత్తనాలను సేకరిస్తూ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తోంది. ముల్కనూర్ రైస్, ముల్కనూర్ సీడ్స్ బ్రాండ్ల ద్వారా మార్కెట్లో ప్రత్యేక గుర్తింపును సాధిస్తోంది. రైతులకు శిక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు పంట ఉత్పత్తి నుంచి తుది ఉత్పత్తి వరకు నాణ్యతా నియంత్రణ చర్యలు చేపడుతోంది.

ఈ సందర్భంగా అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ..రైతుల ఆదాయం పెరగాలంటే వారు వ్యక్తిగతంగా కాకుండా సహకార సంఘాల ద్వారా సంఘటితంగా పనిచేయాలని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను కేవలం విక్రయించడానికే పరిమితం కాకుండా వాటికి విలువ జోడించి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. నాణ్యత, ఆధునిక సాంకేతికత, సమష్టి కృషితో ప్రపంచ మార్కెట్లలో భారతీయ రైతుల ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని తెలిపారు.

అమెరికా తర్వాత దక్షిణ కొరియా మార్కెట్లపై దృష్టి

ముల్కనూర్ సహకార సంఘం ఇప్పటికే అమెరికా వంటి అంతర్జాతీయ మార్కెట్లకు బియ్యం ఎగుమతి చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియా పర్యటన ద్వారా లభించిన పరిచయాలు, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య అవకాశాలు సంఘం భవిష్యత్ అభివృద్ధికి దోహదపడనున్నాయి. ఆధునిక ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ విధానాల అమలు, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ, నూతన ఉత్పత్తుల అభివృద్ధిపై సంఘం ప్రత్యేక దృష్టి సారించనుంది.

ఒక గ్రామీణ సహకార సంఘంగా ప్రారంభమైన ముల్కనూర్ సంస్థను అంతర్జాతీయ వ్యాపార, సాంకేతిక వేదికలపై పరిచయం చేయడంతో పాటు ప్రపంచ స్థాయి పరిజ్ఞానాన్ని స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ పర్యటన సాగింది. ఈ అంతర్జాతీయ అనుభవాలు తెలంగాణ రైతుల ఆదాయాభివృద్ధికి, సహకార రంగం బలోపేతానికి, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడానికి దోహదపడనున్నాయి.

క్యాన్సర్ బాధిత బాలుడి వైద్యానికి రూ.5 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎంపి కడియం కావ్య



హనుమకొండ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్య చికిత్సకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అండగా నిలిచారు. హనుమకొండకు చెందిన మహ్మద్ ఆదిల్ అహ్మద్ అనే బాలుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నవిషయం తెలుసుకున్నఎంపీ కడియం కావ్య ప్రత్యేక చొరవ తీసుకొని బాలుడి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల ముఖ్య మంత్రి సహాయ నిధి ఎల్ఓసీ మంజూరు చేయించారు.మంజూరైన రూ.5 లక్షల ఎల్ఓసీ చెక్కును మంగళవారం కనకదుర్గ కాలనీలోని తన ఎంపీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆపత్కాలంలో తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, బాలుడి వైద్య చికిత్సకు అండగా నిలిచిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు బాధిత కుటుంబ సభ్యులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపల్లి–హుస్నాబాద్ నాలుగు లైన్ల రహదారి పనులు వేగవంతం చేయాలి: పొన్నం

- **పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి**
- **పూర్తయిన మార్గాన్ని త్వరగా అందుబాటులోకి తేవాలని ఆదేశం**
- **నాణ్యత, గడువు విషయంలో రాజీ వద్దని స్పష్టీకరణ**

హుస్నాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): కొత్తపల్లి-హుస్నాబాద్ మధ్య కొనసాగుతున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణతో పాటు కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాల వివరాలను తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికీ అవకాశం ఇవ్వకుండా వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. ప్రతిరోజూ నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న రహదారిలో ఒకవైపు పనులు పూర్తయిన వెంటనే ఆ మార్గాన్ని వీలైనంత త్వరగా వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిర్మాణ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణను పకడ్బందీగా చేపట్టాలని, వాహనాల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రహదారి పనుల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఉపయోగించే నిర్మాణ సామగ్రి, పనుల ప్రమాణాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు నిర్ణయించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, కేవలం వేగం పెంచే క్రమంలో నాణ్యతను విస్మరించరాదని సూచించారు. పనుల పురోగతి, నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. కొత్తపల్లి-హుస్నాబాద్ మధ్య నాలుగు లైన్ల రహదారి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రాంతీయ రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఈ రహదారి నిర్మాణం దోహదపడుతుందని తెలిపారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం - 11 - నవంబర్ 2026
వరంగల్ 05

రాహుల్‌తో మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ



- తెలంగాణ కాంగ్రెస్ బలోపేతంపై అరగంట చర్చ
- ఓబీసీల ప్రాతినిధ్యం, పార్టీ కార్యక్రమాలపై సమీక్ష
- ఈ నెల 13 లేదా 14న హైదరాబాద్‌కు రానున్న రాహుల్
- నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేస్తాం: మహేశ్

హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాల గురించి రాహుల్ గాంధీకి వివరించినట్లు తెలిపారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన నివేదికను రాహుల్ గాంధీకి అందజేసినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఓబీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించడం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయని వివరించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

ఈ నెల 13 లేదా 14 తేదీల్లో భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు రానున్నట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. పర్యటనలో భాగంగా గిగ్ కార్మికులతో ప్రత్యేక సమావేశంలోనూ రాహుల్ పాల్గొంటారని తెలిపారు. వారి సమస్యలు, పని పరిస్థితులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాహుల్ పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎస్ఐఆర్ వ్యతిరేక సభతో పాటు భారీ బీసీ ర్యాలీలో పాల్గొనాలని రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. అయితే ఈ రెండు కార్యక్రమాల నిర్వహణ తేదీలు ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను నవంబర్ నెలలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవుల కేటాయింపుపై త్వరలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ ఆధారంగా తెలంగాణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించడంతో పాటు సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో రాష్ట్ర రాజకీయాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

తాగునీటి పైపులైన్ పనులు వేగవంతం చేయాలి

- ములుగు రోడ్డులో మరమ్మతు, మార్పిడి పనుల పరిశీలన
- క్షేత్రస్థాయిలో పర్యటించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న
- ఆసుపత్రులు, కాలనీలకు నీటి సరఫరా పునరుద్ధరణపై దృష్టి
- నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం

వరంగల్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): వరంగల్ నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రధాన పైపులైన్ మరమ్మతు, మార్పిడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. ములుగు రోడ్డులో కొనసాగుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, మరమ్మతులు, పైపులైన్ మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి నగరంలోని పలు కీలక ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రధాన పైపులైన్ మరమ్మతు, మార్పిడి పనుల కారణంగా సరఫరా పునరుద్ధరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఎంజీఎం ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వంటి వైద్య సంస్థలకు నీటి సరఫరా త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు.

ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీ, కాకతీయ కాలనీ తదితర ప్రాంతాలకు కూడా తాగునీటి సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు, విద్యార్థులు, రోగులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ముఖ్యంగా ఆసుపత్రుల్లో రోగులకు, వైద్య సిబ్బందికి నీటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పైపులైన్ పనుల్లో జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. మరమ్మతులు, మార్పిడి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు ఆటంకాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

నగర ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం మున్సిపల్ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని కమిషనర్ వెంకన్న తెలిపారు. ప్రధాన పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే ఆసుపత్రులు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా తిరిగి అందుబాటులోకి రానుంది.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది.. వారి భార్యకు ఉద్యోగం కల్పిస్తాం: ఎమ్మెల్యే హరీశ్ రావు

- లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- లక్ష్మణ్ భార్యకు ఉద్యోగం కల్పిస్తాం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
- బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా
- లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బీఆర్ఎస్
- భూమి సమస్య పరిష్కారానికి ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలి: పల్లా రాజేశ్వర్ రెడ్డి
- కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి





జనగామ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ కార్యకర్త లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు భరోసా ఇచ్చారు. లక్ష్మణ్ గౌడ్ భార్యకు తగిన ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యతను తాము తీసుకుంటామని ప్రకటించారు. ఉద్యమకారుడి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు.మంగళవారం బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి వెళ్లిన హరీశ్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి లక్ష్మణ్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించినట్లు హరీశ్ రావు తెలిపారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని అన్నారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ గౌడ్ కొనుగోలు చేసిన జేసీబీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గనుల తవ్వకాలకు సంబంధించిన కేసులో అధికారులు స్వాధీనం చేసుకుని నెలల తరబడి పోలీస్ స్టేషన్‌లో ఉంచారని, భారీగా జరిమానాలు విధించడంతో దానిని విడిపించుకోలేకపోయారని తెలిపారు. దీంతో అప్పుల భారం పెరిగినట్లు వివరించారు.


లక్ష్మణ్ గౌడ్‌కు సొంతంగా ఉన్న ఏడు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేశారని, దేవాదుల ప్రాజెక్టు ద్వారా కొన్నే గ్రామ చెరువుకు నీరు రావాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది నీరు రాలేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. సరైన విద్యుత్ సరఫరా లేక పోవడం, బోరు విఫలం కావడంతో పంట ఎండిపోయి పెట్టుబడి నష్టపోయారని వివరించారు.


అలాగే దాదాపు 60 నుంచి 70 ఏళ్లుగా వారసత్వంగా అనుభవిస్తున్న భూమి రెవెన్యూ రికార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్నప్పటికీ, మరో వ్యక్తి హక్కు కోరుతూ దరఖాస్తు చేయడంతో ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని హరీశ్ రావు వెల్లడించారు. దీంతో అప్పులు తీర్చేందుకు భూమిని విక్రయించే అవకాశం లేకుండా పోయిందని, ఈ పరిణామాలు లక్ష్మణ్ గౌడ్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ తరఫున బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించామని, ఆయన భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, సోదరుడికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లక్ష్మణ్ గౌడ్ భార్యకు ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటామని, భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

కుటుంబానికి న్యాయం చేయాలి: పల్లా రాజేశ్వర్ రెడ్డి

ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో, విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, తెలంగాణ పునర్నిర్మాణంలోనూ భాగస్వామిగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో పాటు భూమి సమస్య కారణంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా కుటుంబం అనుభవిస్తున్న భూమి విషయంలో ప్రస్తుత కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి, భూమి సమస్యను పరిష్కరించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుడి కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని, ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోకుండా బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుంటామని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఇరువురు నాయకులు భరోసా ఇచ్చారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా క్రీడలు నిర్వహించాలి: వాకిటి శ్రీహరి





- తెలంగాణకు అవకాశం రావడంలో సీఎం రేవంత్ కృషి
- ఏర్పాట్లపై డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి సమీక్ష
- తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచన
- యువతను బెట్టింగ్ వ్యసనం నుంచి క్రీడల వైపు మళ్లించాలి

హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ఖేలో ఇండియా యువజన క్రీడలు-2026ను దేశం గర్వించేలా, తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదల, కృషి వల్లే తెలంగాణకు ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల నిర్వహణ అవకాశం లభించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

బేగంపేటలోని పర్యాటక ప్లాజాలో మంగళవారం వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేయడం రాష్ట్రానికి దక్కిన గౌరవమని మంత్రి పేర్కొన్నారు. గతంలో శ్రీనగర్‌లో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి ఈ పోటీల నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు ఇవ్వాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఈ అవకాశం దక్కిందని వివరించారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నిర్వహణలో ఏ చిన్న లోపం జరిగినా రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని, ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.

క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని వాకిటి శ్రీహరి సూచించారు. ఈ పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు డిప్యూటీ కలెక్టర్లకు ప్రభుత్వం అవసరమైన అధికారాలు కల్పిస్తోందని తెలిపారు. ముందుగా అందుబాటులో ఉన్న వనరులు, ఎదురయ్యే సవాళ్లు, పరిమితులను గుర్తించి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, అనవసర వ్యయాలతో ప్రభుత్వ నిధులను వృథా చేయవద్దని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని సూచించారు.

యువతలో క్రీడా సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. నేటి యువత సామాజిక మాధ్యమాల్లో చిన్నచిన్న వీడియోలు చూడటానికి ఎక్కువ సమయం కేటాయిస్తోందని, మరోవైపు బెట్టింగ్ వ్యసనం యువతను పట్టిపీడిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను ఈ ప్రభావాల నుంచి బయటకు తీసుకొచ్చి క్రీడల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో గ్రామీణ స్థాయిలో కొనసాగుతున్న క్రీడా సంస్కృతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలోని ప్రతి గ్రామంలో క్రీడలకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం, తగిన అవకాశాలు కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఉపాధ్యక్షురాలు, ఎండీ సోనీబాలాదేవి, వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఖేలో ఇండియా క్రీడలను కేవలం పోటీల నిర్వహణకే పరిమితం చేయకుండా తెలంగాణలో క్రీడా రంగ అభివృద్ధికి ఒక బలమైన వేదికగా మలచాలని మంత్రి ఆకాంక్షించారు.

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం, గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పించడం, మెరుగైన క్రీడా మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ కార్యక్రమం దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

హోటల్ పార్కింగ్‌లో భారీ అగ్నిప్రమాదం

- సోలాపూర్‌లోని అజింక్య తారా హోటల్‌లో ఘటన
- పార్కింగ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- 8 నుంచి 10 వాహనాలు దగ్ధం
- అగ్నిమాపక సిబ్బంది చర్యలతో అదుపులోకి మంటలు



సోలాపూర్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అక్కల్‌కోట్ రోడ్డులో ఉన్న అజింక్య తారా హోటల్ పార్కింగ్ ప్రాంగణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ నిలిపి ఉంచిన వాహనాలకు మంటలు వేగంగా వ్యాపించడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనతో హోటల్ పరిసర ప్రాంతాల్లో కలకలం నెలకొంది. పార్కింగ్ ప్రదేశంలో నిలిపి ఉంచిన వాహనాల్లో మొదట మంటలు కనిపించగా, కొద్ది సేపటికే పక్కనే ఉన్న ఇతర వాహనాలకూ వ్యాపించాయి. మంటల తీవ్రత పెరగడంతో వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 8 నుంచి 10 వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. వాహనాలన్నీ పార్కింగ్‌లో నిలిపి ఉంచిన సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో యజమానులకు భారీ నష్టం కలిగింది.అగ్నిప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టి వాటిని అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా నిలువరించగలిగారు. అయితే అప్పటికే పలు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. విద్యుత్ సంబంధిత లోపమా, వాహనాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యా లేక మరేదైనా కారణమా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. అగ్నిప్రమాదం ఎలా ప్రారంభమైందనే విషయాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంది. పార్కింగ్ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, అగ్నిమాపక పరికరాల అందుబాటుపైనా వివరాలు తెలియాల్సి ఉంది. హోటళ్లు, వాణిజ్య సముదాయాల పార్కింగ్ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది. వాహనాలను నిలిపే ప్రదేశాల్లో విద్యుత్ వ్యవస్థను క్రమం తప్పకుండా పరిశీలించడంతో పాటు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలి. సోలాపూర్ ఘటనలో దెబ్బతిన్న వాహనాల సంఖ్య, ప్రమాదానికి అసలు కారణం, అస్తి నష్టం వివరాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

అస్సాంలో ఏనుగు దంతాల స్మగ్లింగ్ గుట్టురట్టు

- 3.7 కిలోల బరువున్న రెండు ఏనుగు దంతాలు స్వాధీనం
- అక్రమ రవాణా యత్నాన్ని అడ్డుకున్న రెవెన్యూ నిఘా విభాగం
- అధికారులపై ఆయుధాలతో దాడికి స్మగ్లర్ల యత్నం
- వన్యప్రాణుల అక్రమ వ్యాపారంపై కలిన చట్టాలు



న్యూఢిల్లీ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): వన్యప్రాణుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా గుట్టును అస్సాంలో రెవెన్యూ నిఘా విభాగం అధికారులు రట్టు చేశారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 3.7 కిలోల బరువున్న రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ముప్పుగా మారుతున్న అక్రమ వ్యాపారాన్ని అడ్డుకునే చర్యల్లో భాగంగా ఈ దాడి నిర్వహించినట్లు సమాచారం. ఏనుగు దంతాలను రవాణా చేస్తున్న ముఠా కదలికలపై నిఘా ఉంచిన అధికారులు సరైన సమయంలో రంగంలోకి దిగి వాటిని స్వాధీనం చేసుకున్నారు.
అధికారులు దంతాలను స్వాధీనం చేసుకునే క్రమంలో స్మగ్లర్లు ఆయుధాలతో దాడికి యత్నించినట్లు వెల్లడైంది. అయినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి వారి ప్రయత్నాలను అడ్డుకుని ఏనుగు దంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ ఘటనతో వన్యప్రాణుల అక్రమ రవాణా వెనుక పనిచేస్తున్న ముఠాల కార్యకలాపాలపై మరోసారి చర్చ మొదలైంది. అటవీ సంపదను, అరుదైన వన్యప్రాణులను కాపాడేందుకు నిఘా సంస్థలు చేపడుతున్న చర్యల ప్రాధాన్యతను ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఏనుగు దంతాలు వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972లోని మొదటి షెడ్యూల్ పరిధిలోకి వస్తాయి. అంతర్జాతీయంగా అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న వన్యజీవులు, వృక్ష జాతుల వ్యాపార నియంత్రణ ఒప్పందంలోని మొదటి అనుబంధంలోనూ ఏనుగులకు అత్యంత రక్షణ కల్పించారు. ఈ నిబంధనల ప్రకారం ఏనుగు దంతాల అక్రమ కొనుగోలు, విక్రయాలు, రవాణా తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయి. వన్యప్రాణుల నుంచి లభించే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో అక్రమ వ్యాపారులు వాటిని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
ఏనుగుల దంతాల కోసం వాటిని వేటాడటం వల్ల ఈ జంతువుల మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతోంది. అడవుల్లో జీవవైవిధ్య సమతుల్యతను కాపాడటంలో ఏనుగులు కీలక పాత్ర పోషిస్తాయి. వాటి సంఖ్య తగ్గితే పర్యావరణ వ్యవస్థపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉంది. అందువల్ల దంతాల అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు వేటకు పాల్పడే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నిఘా సంస్థలు, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయడం కీలకంగా మారింది. అస్సాంలో స్వాధీనం చేసుకున్న రెండు ఏనుగు దంతాల వ్యవహారంలో అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులు, ముఠా వెనుక ఉన్న ఇతరుల వివరాలపై తదుపరి విచారణ జరగాల్సి ఉంది. ఆయుధాలతో అధికారులపై దాడికి యత్నించినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో ఈ కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాధీనం చేసుకున్న దంతాల మూలాలు, వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలించేందుకు ప్రయత్నించారు అనే అంశాలపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. వన్యప్రాణుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు చట్టాల అమలుతో పాటు ప్రజల్లోనూ వన్యజీవుల సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది.

కొలంబో చేరుకున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా





- తొలి బిమ్‌స్టెక్ ఆరోగ్య మంత్రుల సమావేశానికి హాజరు
- శ్రీలంకలో కేంద్ర మంత్రికి స్వాగతం
- ప్రాంతీయ ఆరోగ్య సహకారంపై ప్రధాన చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకున్నారు. చారిత్రకంగా తొలిసారిగా నిర్వహించనున్న బిమ్‌స్టెక్ ఆరోగ్య మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ప్రాంతీయ దేశాల మధ్య ఆరోగ్య రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిలవనుంది. ఈ సందర్భంగా కొలంబో చేరుకున్న కేంద్ర మంత్రికి అధికారిక కార్యక్రమాల ద్వారా స్వాగతం లభించింది. బిమ్‌స్టెక్ సభ్యదేశాల మధ్య ప్రజారోగ్యానికి సంబంధించిన ఉమ్మడి ప్రాధాన్యతలపై చర్చించేందుకు ఈ సమావేశం వేదిక కానుంది. అంటువ్యాధుల నియంత్రణ, ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య రంగంలో పరస్పర సహకారం వంటి అంశాలపై దేశాలు తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది. ప్రాంతీయ స్థాయిలో ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చలు జరగనున్నాయి. భారత్ ఇప్పటికే పలు దేశాలతో వైద్య సేవలు, ఔషధ రంగం, ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో సహకారాన్ని కొనసాగిస్తోంది. ఈ పర్యటన ద్వారా శ్రీలంకతో పాటు ఇతర బిమ్‌స్టెక్ సభ్య దేశాలతో ఆరోగ్య రంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడనుంది. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలు, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం లభించనుంది.బంగాళాఖాతం ప్రాంతంలోని దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, సామాజిక రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంలో బిమ్‌స్టెక్ కీలక వేదికగా కొనసాగుతోంది.ఆరోగ్యరంగానికి ప్రత్యేకంగా మంత్రుల స్థాయి సమావేశం నిర్వహించడం ద్వారా సభ్య దేశాల మధ్య సమన్వయానికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి. ఉమ్మడి ప్రజారోగ్య ప్రాధాన్యతలపై చర్చించి, భవిష్యత్తులో పరస్పర సహకారంతో చేపట్టాల్సిన కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయనున్నారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా పర్యటన భారత్‌శ్రీలంక మధ్య వైద్య రంగ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు బిమ్‌స్టెక్ సభ్య దేశాల మధ్య ఆరోగ్య సహకారాన్ని పెంచేందుకు దోహదపడనుంది. ప్రాంతీయ ఆరోగ్య భద్రత, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడం వంటి అంశాల్లో సభ్య దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సమావేశం ముందుకు తీసుకురానుంది.

ఫిలిప్పీన్స్‌లో కుప్పకూలిన ప్రైవేటు విమానం






- దావావో డెల్ సుర్‌లో ఘోర ప్రమాదం
- ఆరుగురు విదేశీ ప్రయాణికులు దుర్మరణం
- రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టిన బృందాలు
- ప్రమాద కారణాలపై అధికారుల దర్యాప్తు

దిగోస్ సిటీ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ఫిలిప్పీన్స్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దావావో డెల్ సుర్ ప్రావిన్స్ పరిధిలోని దిగోస్ నగరంలో ఓ ప్రైవేటు విమానం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆరుగురు విదేశీ ప్రయాణికులతో బయలుదేరిన విమానం ప్రమాదానికి గురై తునాతునకలైంది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ప్రమాద వార్తతో స్థానికంగా కలకలం రేగింది. విమానం ప్రయాణం ప్రారంభించిన కొద్దిసేపటికే ప్రమాదం చోటుచేసుకున్నట్లు అందిన సమాచారం ఆధారంగా తెలుస్తోంది. విమానం కూలిపోవడంతో దాని భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాద తీవ్రతకు విమానంలోని ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.అయితే విమానంలో ఆరుగురు ప్రయాణికులతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారా? ప్రమాదంలో మరెవరైనా మృతి చెందారా? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి పరిస్థితిని సమీక్షించారు. విమానం కూలిన ప్రాంతంలో మరెవరైనా చిక్కుకుపోయారా? అనే కోణంలో కూడా పరిశీలన చేపట్టినట్లు సమాచారం. మృతుల వివరాలు, వారి జాతీయతకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.
విమాన ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. సాంకేతిక లోపం, వాతావరణ పరిస్థితులు లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే అంశాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. విమానం ప్రయాణ మార్గం, బయలుదేరిన సమయం, ప్రమాదానికి ముందు ఎదురైన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ప్రమాదానికి అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఫిలిప్పీన్స్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన విమానయాన భద్రతపై మరోసారి ఆందోళన కలిగించింది.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు,మృతుల సంఖ్యకు సంబంధించి మరింత సమాచారం కోసం అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం ఆరుగురు విదేశీ ప్రయాణికులు మృతి చెందినట్లు తెలుస్తుండగా, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ప్రకటన తర్వాత వెల్లడికానున్నాయి.

సోనియా గాంధీ జీవితంపై 544 పేజీల పుస్తకం

- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రచన
- రాజీవ్‌తో పరిచయం నుంచి కుటుంబ జీవితం వరకు ప్రస్తావన
- దేశ రాజకీయ పరిణామాలపైనా ఆసక్తికర అంశాలు
- 2004లో ప్రధాని పదవిని తిరస్కరించడంపైనా వివరాలు



న్యూఢిల్లీ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవితానికి సంబంధించిన వ్యక్తిగత, రాజకీయ అంశాలతో కూడిన 544 పేజీల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పాఠకుల ముందుకు వచ్చినట్లు ప్రచురిత సమాచారం వెల్లడిస్తోంది. రాజీవ్ గాంధీతో తొలి పరిచయం, వారి మధ్య ప్రేమ, వివాహం, కుటుంబ జీవితం, భారతదేశంతో తనకున్న అనుబంధం వంటి అనేక అంశాలను ఇందులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత జీవితంలో ఎదురైన సవాళ్లు,కుటుంబానికి సంబంధించిన అనుభవాలు, రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులకు కూడా రచనలో చోటు కల్పించినట్లు సమాచారం. ప్రచురణకర్తల వివరాల ప్రకారం, ఈ పుస్తకం నవంబర్ 10న భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ విడుదలైంది. 1965లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో విద్యనభ్యసిస్తున్న సమయంలో రాజీవ్ గాంధీతో సోనియాకు పరిచయం ఏర్పడటం, ఆ పరిచయం ప్రేమగా మారడం, అనంతరం భారత్‌కు వచ్చి నెహ్రూ-గాంధీ కుటుంబంలో భాగం కావడం వంటి పరిణామాలను ఆమె ఇందులో వివరించినట్లు పుస్తక పరిచయం పేర్కొంటోంది. ఇటలీలో గడిపిన బాల్యం నుంచి భారతదేశంలో స్థిరపడే వరకు సాగిన జీవిత ప్రయాణానికి ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. అత్త ఇందిరా గాంధీ హత్య, భర్త రాజీవ్ గాంధీ హత్య వంటి విషాద సంఘటనలు తన జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయో కూడా సోనియా ఈ ఆత్మకథనంలో ప్రస్తావించినట్లు సమాచారం. వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచేందుకు తొలినాళ్లలో ప్రయత్నించిన ఆమె, కుటుంబంలో చోటుచేసుకున్న వరుస విషాదాల అనంతరం ప్రజా జీవితంలోకి, రాజకీయాల్లోకి ఎలా అడుగుపెట్టాల్సి వచ్చిందనే అంశాలను వివరించినట్లు ప్రచురణకర్తలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎదురైన సవాళ్లు, రాజకీయ ప్రస్థానంలోని కీలక మలుపులకూ ఇందులో చోటు కల్పించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 11 - నవంబర్ 2026
వరంగల్ 07

భారత నీటి నిర్వహణ ప్రపంచానికి ఆదర్శం

- భారత విధానాలను ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు డైరెక్టర్
- జల్ జీవన్ మిషన్‌తో కోట్లాది మందికి తాగునీరు
- ఏడేళ్లలో 80 కోట్ల మందికి స్వచ్ఛమైన నీరు అందినట్లు వెల్లడి
- ఐక్యరాజ్యసమితి నీటి సదస్సులో అనుభవాలు పంచుకోవాలని పిలుపు



న్యూఢిల్లీ, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశం అనుసరిస్తున్న నీటి నిర్వహణ విధానాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రపంచ బ్యాంకు గ్లోబల్ డైరెక్టర్ సరోజ్ కుమార్ ఝా ప్రశంసించారు. దేశంలో తాగునీటి సరఫరా, నీటి వనరుల నిర్వహణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన చర్యలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గత ఏడేళ్లలో సుమారు 80 కోట్ల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చినట్లు సరోజ్ కుమార్ ఝా వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల విస్తరణకు ఈ కార్యక్రమం దోహదపడిందని పేర్కొన్నారు. ఇంటింటికీ నీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన చర్యలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.

తాగునీటి సరఫరా వ్యవస్థను విస్తరించడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం కూడా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో దీర్ఘకాలిక ప్రణాళికలు, స్థానిక పరిస్థితులకు అనుగుణమైన పరిష్కారాలు అవసరమని పేర్కొన్నారు. నీటి నిర్వహణలో ప్రభుత్వ సంస్థలు, స్థానిక సమాజాలు, ప్రజల భాగస్వామ్యం కీలకమని వివరించారు.

అబుదాబిలో 2026లో నిర్వహించనున్న ఐక్యరాజ్యసమితి నీటి సదస్సులో భారతదేశం తన అనుభవాలను ఇతర దేశాలతో పంచుకోవాలని సరోజ్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. నీటి సరఫరా రంగంలో సాధించిన పురోగతి, ఎదురైన సవాళ్లు, అమలు చేసిన పరిష్కారాలను అంతర్జాతీయ వేదికపై వివరించడం ద్వారా ఇతర దేశాలకు ఉపయోగకరమైన మార్గదర్శకాలు అందించవచ్చని సూచించారు. నీటి భద్రత, అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం వంటి ఉమ్మడి లక్ష్యాల సాధనకు దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు. భారతదేశంలో నీటి నిర్వహణకు సంబంధించి అమలవుతున్న కార్యక్రమాలు అంతర్జాతీయ చర్చల్లో ప్రాధాన్యత పొందుతున్నాయి. జల్ జీవన్ మిషన్ ద్వారా సాధించిన ఫలితాలను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడం, ఇతర దేశాల అనుభవాలను తెలుసుకోవడం భవిష్యత్తులో నీటి వనరుల సమర్థ నిర్వహణకు దోహదపడనుంది. 2026 ఐక్యరాజ్యసమితి నీటి సదస్సు ఈ అంశాలపై చర్చించేందుకు కీలక వేదికగా నిలవనుంది.

స్వాతంత్ర్య పోరాటంలో చెరగని ముద్ర

- దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన నేత
- గాంధీజీ సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడు
- కాంగ్రెస్ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు
- నేటి తరానికి ఆదర్శంగా కృపలానీ జీవితం



డెస్క్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): భారత స్వాతంత్ర్య చరిత్రలో ఎందరో మహనీయులు తమ జీవితాలను దేశం కోసం అంకితం చేశారు. అలాంటి నాయకుల్లో ఆచార్య జె.బి. కృపలానీ ఒకరు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా, విద్యావేత్తగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం. అధికార పదవుల కంటే ప్రజాసేవకు, రాజకీయ ప్రయోజనాల కంటే నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. 1888 నవంబర్ 11న అప్పటి బ్రిటిష్ భారతదేశంలోని సింధ్ ప్రాంతంలో జన్మించిన కృపలానీ పూర్తి పేరు జీవత్రం భగవాన్‌దాస్ కృపలానీ. చిన్ననాటి నుంచే సమాజంలోని పరిస్థితులు, దేశంలో కొనసాగుతున్న బ్రిటిష్ పాలన ఆయనను ఆలోచింపజేశాయి. విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ప్రయత్నించారు. అందుకే ఆయనను ఆచార్యగా పిలిచేవారు. మహాత్మా గాంధీ ఆలోచనలు, అహింసా సిద్ధాంతాలు, సత్యాగ్రహ మార్గం ఆయనను స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపించాయి. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటంలోకి అడుగుపెట్టిన ఆయన భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో కృపలానీ చురుకైన పాత్ర పోషించారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి కీలక పోరాటాల్లో పాల్గొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడంలో తనదైన పాత్ర నిర్వహించారు. గాంధీజీకి అత్యంత సన్నిహితంగా ఉన్న నాయకుల్లో ఆయన కూడా ఒకరు. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు చేపట్టి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో అనేకసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు ఎదురొడ్డి నిలిచినా తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు. ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించడం, యువతను ఉద్యమం వైపు నడిపించడం, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన పోరాటం కేవలం బ్రిటిష్ పాలనను అంతం చేయడానికే పరిమితం కాలేదు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం బలంగా ఉండాలన్నది ఆయన ఆకాంక్ష. అందుకే స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా కూడా ఆయనకు గుర్తింపు లభించింది.

1946లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కృపలానీ బాధ్యతలు చేపట్టారు. దేశానికి స్వాతంత్ర్యం లభించడానికి ముందు అత్యంత కీలకమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్న సమయంలో ఆయన ఈ పదవిలో కొనసాగారు. స్వాతంత్ర్య సాధన, అధికార మార్పిడి, దేశ విభజన వంటి సంక్లిష్ట పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకత్వంతో కలిసి పనిచేశారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వ విధానాలు, ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుపై ఆయన నిశితంగా దృష్టి సారించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోకూడదని భావించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం ఉండాలని గట్టిగా వాదించారు. పాలకుల పై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో తప్పు కాదని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు అని తన రాజకీయ ప్రస్థానం ద్వారా చాటిచెప్పారు. అధికారంలో ఉన్నవారిని సమర్థించడం కంటే ప్రజల పక్షాన నిలబడటానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకత్వంతో విభేదాలు వచ్చిన సందర్భాల్లోనూ తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత ప్రయోజనాల కంటే సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆయన వైఖరి నేటికీ చర్చనీయాంశంగా నిలుస్తోంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో కృపలానీ తనదైన మార్గంలో ప్రజాసేవ కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలతో విభేదిస్తూ బయటకు వచ్చి స్వతంత్ర రాజకీయ దృక్పథంతో ముందుకు సాగారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నించారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలే ప్రధాన అజెండాగా ఉండాలని నమ్మారు. ఆయన భార్య సుచేతా కృపలానీ కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ రాజకీయ నాయకురాలు. దేశ రాజకీయాల్లో ఆమె కూడా విశేష గుర్తింపు పొందారు. భారత దేశంలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తొలి మహిళగా సుచేతా కృపలానీ చరిత్ర సృష్టించారు. దంపతులిద్దరూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం, ప్రజాసేవకు జీవితాలను అంకితం చేయడం విశేషం. కృపలానీ రాజకీయాల్లో నైతికత, నిరాడంబరత, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజకీయ నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, అధికారాన్ని ప్రజాసేవకు ఉపయోగించాలని నిరంతరం సూచించారు. రాజకీయాల్లో విమర్శలను సహించగలగడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం, ప్రజా సమస్యలపై నిబద్ధతతో పోరాడటం వంటి లక్షణాలు ఆయన వ్యక్తిత్వంలో ప్రధానంగా కనిపించేవి. 1982 మార్చి 19న ఆయన మరణించినప్పటికీ ఆయన రాజకీయ జీవితం, ప్రజాస్వామ్యంపై ఆయనకు ఉన్న నిబద్ధత చరిత్రలో నిలిచిపోయాయి.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆచార్య జె.బి. కృపలానీ జీవితం, ఆయన సిద్ధాంతాలు మరోసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. నేటి రాజకీయాల్లో అధికారమే లక్ష్యంగా మారుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రజల సమస్యల పరిష్కారం, పాలనలో పారదర్శకత వంటి అంశాలపై అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రాజకీయాల్లో సిద్ధాంతాలు, విలువలు, ప్రజాసేవకు ప్రాధాన్యం తగ్గకూడదనే విషయాన్ని కృపలానీ జీవితం తెలియజేస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షం ప్రజాస్వామ్యానికి బలమని, ప్రజల తరపున నిలబడే నాయకత్వమే సమాజానికి అవసరమని ఆయన రాజకీయ ప్రస్థానం స్పష్టం చేస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకుండా వారు చూపిన మార్గాన్ని ఆచరణలో పెట్టాలి. యువతకు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను తెలియజేయడంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థలపై అవగాహన కల్పించాలి. ఆచార్య కృపలానీ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా రాజకీయాల్లో నిజాయితీ, నిరాడంబరత, నైతికత, ప్రజల పట్ల బాధ్యత వంటి విలువలను కాపాడుకోవాలని సంకల్పించాలి. పదవులు శాశ్వతం కాకపోయినా ప్రజల కోసం చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోతాయనే సత్యానికి ఆయన జీవితం నిదర్శనం.

జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా

- రాష్ట్ర విద్యుత్ అవసరాలకు సింగరేణి భరోసా
- యాదాద్రి కేంద్రానికి నైనీ గని నుంచి బొగ్గు రవాణా
- ఈ నెలాఖరు నుంచి రోజుకు 16 వేల టన్నుల సరఫరా
- అవసరమైతే మరింత బొగ్గు అందించేందుకు సిద్ధం



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్ణయించింది. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఇంధనాన్ని నిరంతరాయంగా అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. విద్యుత్ డిమాండ్ మరింత పెరిగిన పక్షంలో అదనపు బొగ్గును కూడా అందించేందుకు సింగరేణి సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వర్గాలు వెల్లడించాయి.

ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు రవాణా చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఈ నెలాఖరు నుంచి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గును యాదాద్రి కేంద్రానికి తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలను సమకూర్చుకోవడంతో పాటు సరఫరాలో నిరంతరతను కొనసాగించేందుకు అవకాశం ఏర్పడనుంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు సరఫరాను సమన్వయం చేసేందుకు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో సమావేశం జరిగింది. సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బొగ్గు సరఫరా, విద్యుత్ కేంద్రాల అవసరాలు, రవాణా ప్రణాళికలపై చర్చించారు.

తెలంగాణ జెన్‌కోకు అవసరమైన బొగ్గును ప్రాధాన్యత క్రమంలో అందించాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు తగిన స్థాయిలో ఉండేలా సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నైనీ గని నుంచి యాదాద్రి కేంద్రానికి బొగ్గు రవాణా ప్రారంభం కావడంతో సింగరేణి సరఫరా సామర్థ్యానికి అదనపు బలం చేకూరనుంది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా రవాణా ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించడంపై దృష్టి సారించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యవసాయం, గృహ వినియోగం తదితర రంగాల్లో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు సరఫరాకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి, తెలంగాణ జెన్‌కో మధ్య సమన్వయం ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఇంధనాన్ని అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అవసరాన్ని బట్టి మరింత బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సిద్ధంగా ఉండటంతో రాష్ట్ర విద్యుత్ కేంద్రాలకు ఇంధన లభ్యతను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టినట్లయింది.

యుద్ధాలకు ముగింపు ఎప్పుడో?

- ప్రపంచ శాంతికి విఘాతంగా యుద్ధాలు
- ప్రాణాలు కోల్పోతున్న అమాయక ప్రజలు
- శాంతి మార్గమే మానవాళికి శ్రీరామరక్ష



డెస్క్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ చరిత్రలో యుద్ధాలు ఎన్నో దేశాల భవిష్యత్తును మార్చాయి. రాజ్యాల విస్తరణ, భూభాగాల ఆక్రమణ, రాజకీయ ఆధిపత్యం, వనరులపై నియంత్రణ, దేశాల మధ్య పరస్పర విభేదాలు వంటి కారణాలతో జరిగిన యుద్ధాలు లక్షలాది కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. యుద్ధం ప్రారంభించడం పాలకులకు కొన్ని సందర్భాల్లో సులభంగా కనిపించినా దాని పరిణామాలను భరించాల్సి వచ్చేది మాత్రం సామాన్య ప్రజలే. సైనికులు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతుంటే వారి కుటుంబాలు అనిశ్చితి, ఆందోళన మధ్య జీవనం సాగిస్తాయి. యుద్ధరంగంలో తుపాకీ తూటాలకు బలయ్యే సైనికులతోపాటు బాంబు దాడులు, ఆకలి, వ్యాధులు, నిరాశ్రయత్వం కారణంగా వేలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోతుంటారు. మొదటి ప్రపంచ యుద్ధం మానవ చరిత్రలో అత్యంత భయంకరమైన ఘట్టాల్లో ఒకటిగా నిలిచింది. 1914లో ప్రారంభమైన ఈ యుద్ధం నాలుగేళ్లకు పైగా కొనసాగి 1918 నవంబర్ 11న యుద్ధ విరమణ ఒప్పందంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న యుద్ధ విరమణ దినోత్సవాన్ని నిర్వహిస్తూ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులను, బాధితులను స్మరించుకుంటారు. యుద్ధాల వల్ల కలిగే నష్టాలను గుర్తుచేసుకుంటూ ప్రపంచ శాంతి అవసరాన్ని చాటిచెప్పడం ఈ రోజు ప్రధాన ఉద్దేశం. మొదటి ప్రపంచ యుద్ధం 1914 జూలైలో ప్రారంభమై 1918 నవంబర్ వరకు కొనసాగింది. యూరప్‌లోని దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు, సైనిక కూటములు, సామ్రాజ్యవాద పోటీలు, జాతీయవాద భావాలు ఈ యుద్ధానికి ప్రధాన నేపథ్యంగా నిలిచాయి. ఆస్ట్రియాహంగేరీ యువరాజు ఆర్చ్‌డ్యూక్ ఫ్రాంజ్ ఫెర్డినాండ్ హత్య అనంతరం నెలకొన్న పరిణామాలు యుద్ధానికి తక్షణ కారణమయ్యాయి. క్రమంగా అనేక దేశాలు ఈ పోరాటంలోకి దిగడంతో అది ప్రపంచ యుద్ధంగా మారింది. ఒకవైపు జర్మనీ, ఆస్ట్రియాహంగేరీ తదితర దేశాలు, మరోవైపు బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా తదితర దేశాలు పోరాటంలో పాల్గొన్నాయి. అనంతరం అమెరికా కూడా యుద్ధంలో ప్రవేశించింది. యుద్ధరంగాల్లో ఆధునిక ఆయుధాలు, భారీ ఫిరంగులు, విషవాయువులు, యంత్ర తుపాకులు విని యోగించడంతో ప్రాణనష్టం ఊహించని స్థాయికి చేరుకుంది. అనేక ప్రాంతాలు శిథిలాలుగా మారాయి. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. యుద్ధం ముగిసినప్పటికీ దాని గాయాలు ఎన్నో సంవత్సరాల పాటు దేశాలను వెంటాడాయి. ఈ చారిత్రక విషాదం మానవాళికి యుద్ధం వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా తెలియజేసింది. నవంబర్ 11 యుద్ధ విరమణ దినానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1918 నవంబర్ 11న ఉదయం 11 గంటలకు జర్మనీతో కుదిరిన యుద్ధ విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీంతో మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రధాన పోరాటాలు నిలిచిపోయాయి. ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ అనేక దేశాల్లో స్మారక కార్యక్రమాలు నిర్వహిస్తారు. యుద్ధంలో మరణించిన సైనికులకు నివాళులర్పిస్తారు. సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి మౌనం పాటిస్తారు. ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఈ రోజును ప్రత్యేకంగా పాటిస్తారు. కొన్ని దేశాల్లో దీనిని స్మారక దినోత్సవంగా, మరికొన్ని దేశాల్లో అనుభవజ్ఞుల దినోత్సవంగా నిర్వహిస్తారు. ఎర్రటి గసగసాల పువ్వును యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగానికి చిహ్నంగా ఉపయోగిస్తారు. యుద్ధరంగాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని మాత్రమే కాకుండా గాయాలతో జీవితాలను కోల్పోయిన సైనికులు, యుద్ధం కారణంగా కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రజలను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

రాష్ట్రాన్ని వణికిస్తున్న చలిపులి

- రానున్న మూడు రోజులు చలిగాలుల తీవ్రత పెరిగే అవకాశం
- 29 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక
- ఏడు జిల్లాల్లో 12 డిగ్రీలకు పడిపోనున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు.. వాహనదారులకు అప్రమత్తత సూచన



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణవ్యాప్తంగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో చలిగాలుల ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాత్రి సమయాల్లోనే కాకుండా తెల్లవారుజాము న, ఉదయం వేళల్లోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే దిగువకు పడిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 12 డిగ్రీల వరకు పడిపోయే అవకాశముందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో చలి ప్రభావం కనిపిస్తోంది. నేరెడుగొండలో అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రానున్న రోజుల్లో మరికొన్ని ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు చలిగాలుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న చల్లని గాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ గాలుల కారణంగా రానున్న మూడు రోజుల పాటు తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకునే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, గ్రామీణ ప్రాంతాలు, అటవీ మార్గాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

పొగమంచు కారణంగా రహదారులపై దృశ్యమానత తగ్గి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో ప్రయాణించే వారు వాహనాల వేగాన్ని తగ్గించి, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు వాహనాల వెలుగులను వినియోగించాలని, పొగమంచు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొందరపాటు ప్రయాణాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. మూడు రోజుల పాటు చలి, పొగమంచు ప్రభావం ఉండే అవకాశం నేపథ్యంలో ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటించాలని అధికారులు కోరుతున్నారు.

సింగరేణిలో నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం

- విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమం
- సింగరేణి భవన్‌లో ఉద్యోగులకు అవగాహన
- ప్రధాన వక్తగా సాఫ్ట్ స్కిల్స్ శిక్షకుడు కిశోర్ బగాడియో
- నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని పిలుపు



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2026 సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో నైతిక విలువలు, నిజాయితీ, బాధ్యతాయుతమైన పని విధానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'సమృద్ధి కోసం నిజాయితీ' అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ శిక్షకుడు కిశోర్ బగాడియో ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఉద్యోగులు తమ విధులను నిర్వహించే సమయంలో వ్యక్తిగత విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి పాత్ర కీలకమని, బాధ్యతాయుతమైన పనితీరు సంస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని వివరించారు. నిజాయితీతో కూడిన విధానాలు కార్యాలయాల్లో పారదర్శకతను పెంచుతాయని కిశోర్ బగాడియో పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం, నైతిక ప్రమాణాలను పాటించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సంస్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ద్వారా అవినీతి నిరోధక చర్యలపై ఉద్యోగుల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయవచ్చని కార్యక్రమం ఉద్దేశం తెలియజేస్తోంది. సంస్థలోని ప్రతి విభాగంలో నిబంధనలు, పారదర్శకత, నైతిక విలువలు పాటించడం ద్వారా మెరుగైన పని వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల పనితీరును మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడనున్నాయి. నిజాయితీ, విలువలతో కూడిన సేవల ద్వారా సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్యోగుల్లో నైతిక ప్రవర్తన, పారదర్శకతపై చైతన్యం కల్పించడంపై దృష్టి సారించింది.

గ్రూప్-1 మూల్యాంకనంపై విచారణకు డిమాండ్

- టీజీపీఎస్సీ కార్యదర్శి హరితకు బీఆర్ఎస్ నేతల వినతి
- సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపాలని కోరిన నేతలు
- జవాబు పత్రాలపై న్యాయపరమైన పరిశీలనకు విజ్ఞప్తి
- అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగొద్దని వినతి



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): గ్రూప్ 1 నియామక ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు అభ్యర్థులతో కలిసి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి హరితకు వినతిపత్రం సమర్పించారు. గ్రూప్ 1 ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ ప్రక్రియపై అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసి, నియామకాల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపించాలని, అవసరమైతే సిట్టింగ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నేతలు ప్రధానంగా డిమాండ్ చేశారు. మూల్యాంకన ప్రక్రియలో ఎక్కడైనా తప్పులు లేదా అక్రమాలు చోటుచేసుకున్నాయా అనే అంశాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించాలని కోరారు. అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో విచారణలో అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న డీఎస్పీ అభ్యర్థుల్లో సుమారు 35 శాతం మంది విఫలమైనట్లు వెలువడిన వార్తలను, ఈ వ్యవహారంపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కూడా విచారణ సందర్భంగా పరిశీలించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ అంశాలకు గ్రూప్ 1 మూల్యాంకన వివాదంతో ఉన్న సంబంధాన్ని తగిన ఆధారాలతో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

గ్రూప్ 1 ప్రధాన పరీక్షల మూల్యాంకన రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల జవాబు పత్రాలను పూర్తి పారదర్శకతతో మరోసారి మూల్యాంకనం చేయాలని కోరారు. మూల్యాంకనానికి సంబంధించిన రికార్డులు, ఇతర వివరాలను నిపుణుల పరిశీలనకు అందుబాటులో ఉంచడం ద్వారా సందేహాలకు తావులేకుండా చేయవచ్చని పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో ప్రతిభకే ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హత కలిగిన ఏ ఒక్క అభ్యర్థికీ అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు, సతీష్ ఉపేంద్ర, కొడంగల్ రవికుమార్‌తో పాటు పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు. కమిషన్ ఈ వినతిపై స్పందించి, అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

హుస్నాబాద్ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి



- 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పరిశీలన
- స్లాబ్ పనుల పురోగతిపై మంత్రి పొన్నం ఆరా
- ఇకపై జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచన

హుస్నాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): హుస్నాబాద్‌లో నిర్మాణంలో ఉన్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం భవనానికి స్లాబ్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పనుల తీరును పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్మాణంలో ఇప్పటికే పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా భవనానికి సంబంధించిన స్లాబ్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. పనుల నిర్వహణలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

ఆసుపత్రి బేస్‌మెంట్ నిర్మాణానికి కొంత సమయం పట్టినప్పటికీ, ఇకపై చేపట్టే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా ప్రతి దశలో పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు.

ఆసుపత్రి భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యత, పనుల పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. వేగంగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నాణ్యతను విస్మరించరాదని, దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా పటిష్ఠమైన నిర్మాణం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే హుస్నాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. స్థానికంగా మెరుగైన చికిత్స పొందేందుకు ఈ ఆసుపత్రి ఉపయోగపడనుంది. అందువల్ల నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

పాలమూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం: వి. శ్రీనివాస్ గౌడ్

- మూడేళ్లలో రూ.60 వేల కోట్ల హామీ ఏమైందని ప్రశ్న
- వలసలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి విమర్శ



హైదరాబాద్, నవంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు): పాలమూరు జిల్లాకు అభివృద్ధి నిధులు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలకు నిధులన్నీ తరలిస్తున్నారని విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు పాలమూరు జిల్లాకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాకు ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున మూడేళ్లలో రూ.60 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, కనీసం రూ.6 కోట్లు అయినా ఇచ్చారా అని నిలదీశారు. జిల్లాకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి చెందిన మూడు ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలు వెనక్కి వచ్చాయని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కృష్ణా నది నుంచి కనీసం 30 టీఎంసీల నీటిని కూడా ఎత్తిపోసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పాలమూరు జిల్లాపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం 300 మీటర్ల మేర మరమ్మతులు చేపడితే 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ పనులు కూడా చేయలేదని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా ఇతర రాష్ట్రాల ప్రజలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో మళ్లీ వలసలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క కొత్త అభివృద్ధి పనైనా చేపట్టారా అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం మాత్రమే సరిపోదని, పీఆర్సీ, కరవు భత్యం అమలు చేస్తామని ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ హామీలను నమ్మి ఉద్యోగులు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని పేర్కొన్నారు. కేసీఆర్ అప్పులు చేశారని పదేపదే విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు, ఆ నిధులతో నిర్మించిన ప్రాజెక్టులు, రహదారులు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా గుర్తించాలని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. చేయాల్సిన పనులు చేయకుండా ప్రతిసారీ కేసీఆర్‌ను నిందించడం ప్రజలు అంగీకరించరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలకు మారుపేరుగా మారిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. పాలమూరు జిల్లా పచ్చగా కళకళలాడాలన్నా, రైతులకు మేలు జరగాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in